

వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం కావాలి

వైద్య ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. శారీరకంగా, మానసికంగా హింసించే వారికి కఠిన శిక్షలు విధించేలా చట్టాలు రూపొందించాలి. వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య సంస్థలపై దాడుల నిరోధక బిల్లును 2019 లోనే రూపొందించారు. ఇప్పటికైనా వైద్యులపై దాడుల నిరోధక బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలి.

– స్వరూపారెడ్డి, మెడికల్ ఆఫీసర్, పరిగి



విధులు నిర్వర్తించాలంటే భయంగా ఉంది

గ్రామానికి కొంత దూరంగా పీహెచ్‌సీ ఉంది. పక్కనే జాతీయ రహదారి కావడంతో ఎప్పుడు ఏ ఉపద్రవం సంభవిస్తుందో అని భయం గుప్పెట్లో రాత్రి పూట విధులు నిర్వహిస్తున్నాం. ఆస్పత్రి చుట్టూ సరైన విద్యుత్ సౌకర్యం లేదు. విశ్రాంతి గది, సరైన భద్రత కల్పించక పోవడం బాధాకరం. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణం చాలా బాధాకరమైన సంఘటన. అది గుర్తుకు వచ్చిన ప్రతి సారి ఒల్లు జలధరిస్తుంది. రాత్రి వేళలో వైద్యసిబ్బందికి భద్రత కల్పించాలి.

– శ్రావణి, ప్రభుత్వ వైద్యురాలు, గుట్టూరు



అరటి... లాభాల్లో మేటి

- యాలక్కి రకం సాగుపై రైతుల మొగ్గు
- ఎకరాకు రూ.2 లక్షలకు పైగా ఆదాయం



పెద్దపల్లి వద్ద సాగు చేసిన అరటి

మడకశిరరూరల్: అరటి సాగు రైతులకు లాభదాయకంగా మారింది. ప్రధానంగా యాలక్కి రకం రైతులకు సిరులు కురిపిస్తోంది. ప్రసుత్తం మార్కెట్‌లో యాలక్కి అరటికి మంచి ధర ఉండడంతో రైతులు అరటి సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మడకశిర డివిజన్‌లోని మడకశిర, అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల మండలాల్లో వ్యవసాయ బోరు బావుల కింద రైతులు 100 ఎకరాలకు పైగా అరటి తోటలను సాగు చేశారు. వేరుశనగ సాగు చేసి నష్టపోతుండడంతో ప్రత్యామ్నాయ పంటగా అరటిపంటను సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఎకరాకు 500 అరటి మొక్కలు

ఈ పంటను సాగుచేయడానికి రైతులు అనంతపురం, తుమకూరు, హిందుపురం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి అరటి పిలకలను కొనుగోలు చేస్తున్నారు. ఒక ఎకరాలో 500 అరటి మొక్కలు నాటుతారు. పంట సాగుకు కూలీలు, ఎరువులు, మందులు తదితర వాటికి రూ.70 వేలు వరకు పెట్టుబడి పెట్టుతున్నారు. పంట దిగుబడి బాగా వచ్చి మార్కెట్‌లో మంచి ధర ఉంటే ఖర్చులు పోను ఒక ఎకరాకు రూ.2 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. ప్రసుత్తం మార్కెట్‌లో ఎన్నడూ లేని విధంగా టన్ను యాలక్కి అరటికి రూ.50 వేల నుంచి రూ.55 వేల వరకు ధర ఉంది.

మార్కెట్‌లో మంచి ధర



నా బోరు బావుల కింద రెండు ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల ద్వారా అరటి పంట సాగు చేశాను. ఇప్పటికే మెదటి విడతలోనే రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది. రెండో విడతలో రూ.2 లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో ఖర్చులు పోను ఎకరాకు రూ.2 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. గత ఏడాది రూ.2.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది. – బాబురెడ్డి, రైతు, పెద్దపల్లి

సేంద్రియ పద్ధతుల్లో అరటి సాగు



బోరు బావి కింద సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో మూడు ఎకరాల్లో కొత్తగా యాలక్కి అరటి పంట సాగు చేశాను. పంట ఆశాజనకంగా ఉంది. 50 రోజుల తర్వాత పంట కోతకు వస్తుంది. మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో మెదటి పంటలోనే మంచి ఆదాయం వస్తుందని నమ్మకం ఉంది. అరటి, దానిమ్మ పంటల సాగులో నష్టం ఉండదు.

– హనుమంత రాయప్ప, రైతు గౌడనహళ్లి, మడకశిర మండలం

మూడెకరాల్లో సాగు చేశాను..



నా వ్యవసాయ బోరు కింద మూడు ఎకరాల్లో డ్రిప్ పద్ధతి ద్వారా అరటి పంటను సాగు చేశాను. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. 25 రోజుల తర్వాత మార్కెట్‌కు తరలిస్తాం. కూలీలు, ఎరువులు, మందులు ఖర్చులు పోనూ మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

– శ్రీరామరెడ్డి, రైతు, మెళవాయి మడకశిర మండలం

కార్మికులకు జీతాలు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

హిందూపురం టౌన్: నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్‌లో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరామిరెడ్డి వాటర్ సప్లై స్కీమ్ ద్వారా పీఏబీఆర్ రాయదుర్గం, కళ్యాణదుర్గం, బెలుగుప్ప, హిందూపురం, మడకశిర డివిజన్‌లో దాదాపుగా 750 గ్రామాలకు 600 మంది కార్మికులు నిరంతరం పని చేస్తూ తాగునీరు అందిస్తున్నారని ఎతలిపారు. అయితే వీరికి నెలల కొద్దీ వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ముగ్గురు కార్మికులను గొల్లపల్లి పంప్ హౌస్‌లో తొలగించారని తెలిపారు. లేపాక్షి మండలం పులిమతికి చెందిన బాలు, అనిల్, రవి అనే కార్మికులు గత 14 సంవత్సరాలుగా పని చేస్తున్నా.. తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు రాము, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లై స్కీమ్ యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు మురళి, గిరీష్, బాలకృష్ణ, మహానంది, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

మట్టి దోపిడీ కనిపించ లేదా?



ఇరిగేషన్ శాఖ డీఈ లక్ష్మీనారాయణను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

పరిగి: మండలంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విచ్చలవిడిగా మట్టి, ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ప్రజా ప్రతినిధులు విమర్శించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సవిత అధ్యక్షతన నిర్వహించారు.

మట్టి తరలింపుపై వివక్ష ఎందుకు?

పరిగి చెరువులో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆపార్టీ నాయకులు అక్రమంగా పరిగి, శ్రీరంగరాజుపల్లి చెరువుల్లో మట్టిని ఇష్టానుసారంగా తోలేసే అధికారం ఎవరిచ్చారంటూ సభలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ అధికార పార్టీ నాయకులకు ఒత్తాసు పలుకుతున్నారని కొడిగెనహళ్లి ఎంపీటీసీ సభ్యుడు మారుతీరెడ్డి నిలదీశారు. టీడీపీ నాయకులకు మాత్రం కమీషన్లకు కక్కుర్తిపడి ఇష్టానుసారంగా అనుమతులిచ్చేస్తారా? అంటూ మారుతీరెడ్డితో పాటు కో–ఆప్షన్ మెంబర్, హొన్నంపల్లి సర్పంచ్ మంజునాథ్ రెడ్డి తదితరులు ప్రశ్నించారు. లక్ష్మీనారాయణ స్పందిస్తూ మట్టి తరలింపునకు పెట్టిన వినతులను రిజెక్టు చేయబోమని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రొటోకాల్ పాటించరా?

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రొటోకాల్ నిబంధనకు అధికారులు పాతరేశారని సభలో ఎంపీటీసీ మారుతీరెడ్డి, కోఆప్షన్ మెంబర్ సలీం, హొన్నంపల్లి సర్పంచ్ మంజునాథ్‌రెడ్డితో పాటూ టీడీపీ నాయకుడు, బీచిగానిపల్లి సర్పంచ్ బాలాజీ అన్నారు. వైస్ ఎంపీపీ శకుంతల, ఎంపీడీఓ సరస్వతి, స్పెషలాఫీసర్ ప్రసాదరావు, ఏఓ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అధికారులను కోరారు. ఆయన శనివారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. తాగునీరు, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులను అరికట్టడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎం.రాయాపురం, కొంకల్లులో అతిసారంతో పలువురు మృతి చెందారని తెలిపారు. పారిశుధ్య లోపం, తాగునీరు కలుషితం కావడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని కోరారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీఎంహెచ్‌ఓ మంజువాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మల్లికార్జున, డీఎల్‌పీఓ శివరామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయక్, ఏఈలు, 5 మండలాల ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, ఏఓలు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు



సూచనలు ఇస్తున్న ఏడీ అల్తాఫ్ అలీఖాన్

హిందూపురం: హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురం మండలాల్లో 8,087 హెక్టార్లలో మొక్కజొన్న సాగైనట్లు వ్యవసాయ శాఖ ఏడీ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఈ పైరు వివిధ దశల్లో ఉందని పేర్కొన్నారు. మొక్కజొన్నలో అధిక దిగుబడి పొందడానికి లీటర్ నీటికి పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టి బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా స్పైనొసాడ్ 0.3 మిల్లీమీటర్ పిచికారీ చేయాలని తెలిపారు. క్లోరంత్రనిల్ పోల్ 0.3 మిల్లీలీటర్లు లేదా స్పైని టోరం 0.5 మిల్లీలీటర్లు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేస్తే కత్తెర పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విషపు ఎరను 10 కేజీల తవుడు 2 కేజీల పాత నల్లటి బెల్లం అర లీటరు ప్రొఫెనోపాస్ మందును కలిపి చిన్న చిన్న ఉంటలుగా తయారు చేసి సాయంత్రం వేళల్లో మొక్కజొన్న పొలంలో వేసిన కత్తెర పురుగు నివారించవచ్చని వివరించారు.

ఎం.రాయాపురంలో మరో ఇద్దరికి అతిసారం



నీళ్లలో క్లోరిన్ మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రొళ్ల: ఎం.రాయాపురంలో శనివారం కొత్త 2 అతిసారం కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు గ్రామంలో సుమారు 62 మందికి పైగా అతిసార బారిన పడ్డారని వైద్యులు చెబుతున్నారు. అందులో తీవ్ర అస్వస్థతకు గురైన ముగ్గురు వ్యక్తులు ఇప్పటికే మృతి చెందిన విషయం తెలిసింది. గ్రామంలో కొత్తగా సిద్ధప్ప, చన్నమ్మ అతిసార బారిన పడ్డారు. గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు శిర, బెంగళూరు, తుమకూరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స చేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉండగా వైద్యఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీటిలో వేసుకుని తాగాలంటూ క్లోరిన్ మాత్రలు పంపిణీ చేశారు.

పిచ్చి మొక్కల తొలగింపు

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామంలో శనివారం సర్పంచ్ కరియమ్మ, వైఎస్సార్‌సీపీ యువనేత డి.రవికుమార్, వైస్ సర్పంచ్ ఎస్.రవికుమార్ గ్రామంలో పిచ్చిమొక్కలు తొలగించారు. ఇటీవల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ (54) ఇంటి పక్కనే ప్రత్యేకంగా వేసుకున్న మేకల కల్లంలో పాముకాటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. స్పందించిన వారు రూ.12 వేలు ఖర్చు చేసి గ్రామం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, సీమతుమ్మ చెట్లతో పాటు పేడ దిబ్బలు, చెత్తా చెదారం, రాళ్లు ఇతరాత్ర వాటిని జేసీబీ సాయంతో తొలగించారు.

నేడు విద్యుత్ అంతరాయం

హిందూపురం అర్బన్: పట్టణంలోని డీబీ కాలనీ, డీఆర్ కాలనీ, లక్ష్మీపురం, శ్రీకంఠపురం, మొడల్ కాలనీ, ఆబాద్ పేట, బైపాస్ రోడ్, ధర్మపురం, మక్కిడి పేటలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదని విద్యుత్ శాఖ ఈఈ భూపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

చిలమత్తూరు: సరిహద్దు చెక్‌పోస్ట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మహేష్ తెలిపారు. శనివారం మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టను తనిఖీ చేశారు. అంతకుముందు స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

పశువుల బెడద నివారణకు చర్యలు

మడకశిర: పట్టణంలో పశువులు, కుక్కలు, పందుల నివారణకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 15లోగా పశువులు, 30లోపు పందులు, ఆ తర్వాత కుక్కల బెడదను నివారిస్తామమని పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మడకశిర: తమ సమస్యలు పరిష్కరించాలని శనివారం పట్టణంలోని చౌటిపల్లి కాలనీ వాసులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కోరారు. అనంతపురం నుంచి మడకశిర వస్తున్న ఎమ్మెల్యే తన కారును చౌటిపల్లి వద్ద ఆపగా కాలనీ వాసులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాగునీరు, వీధి దీపాలు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీకి అధికారులతో వచ్చి సమస్యలు

సంక్షిప్త సమాచారం

పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రొద్దం: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలోని పీర్ల చావిడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, హఫ్సా క్లినిల్ సహకారంతో ఐకేర్ కంటి పరీక్షా కేంద్రం పెనుకొండ వారు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అన్ని రకాల కంటి సమస్యలను ఉచితంగా కంప్యూటర్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమై వారికి తక్కువ ధరలకే కంటి అద్దాలు అందజేశారు.

రీలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: హిందూపురం తాలూకా సిల్క్ రీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఖాజా, కార్యదర్శిగా ముస్తఫా, ఉపాధ్యక్షుడిగా బాష, జాయింట్ సెక్రటరీగా దాదాపీర్, కోశాధికారిగా ఖలీల్, ఉప కోశాధికారిగా రహీమ్ బాషా, సభ్యులుగా సలావుద్దీన్, ఆదినారాయణ, అల్లాబకాష్, ఎస్.అల్లాబకాష్, నూరుల్లా, నయాజ్, చాందు, అసిఫ్, బాబు, షఫీ, అయూబ్, అసీఫ్, ఇమ్రాన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. సిల్క్ రీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గిరిజన గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గోరంట్ల: గోరంట్ల, పెనుకొండలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలల్లో నాలల్గో తరగతి నుంచి 9 వతరగతి వరకు ఖాళీలు ఉన్నాయని, అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోరంట్ల గురుకుల గిరిజన పాఠశాలలో నాల్గో తరగతిలో 30 సీట్లు, ఐదో తరగతిలో 21 సీట్లు, ఆరో తరగతిలో –1 , ఏడో తరగతిలో 10 సీట్లు, ఎనిమిదో తరగతిలో రెండు సీట్లు, తొమ్మిదో తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పెనుకొండ గిరిజన గురుకుల పాఠశాలలో నాల్గో తరగతిలో 30 సీట్లు ఐదో తరగతిలో 24 సీట్లు, ఆరో తరగతిలో 18 సీట్లు, ఏడో తరగతిలో ఏడు సీట్లు, ఎనిమిదో తరగతిలో 10 సీట్లు, తొమ్మిదో తరగతిలో 16 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

రైతు సమస్యలపై ఉద్యమిస్తాం

హిందూపురం: రైతుల సమస్యలపై ఉద్యమిస్తామని భారతీయ కిసాన్ యూనియన్ (ఏ) రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆర్‌పీజీటీ రోడ్డులోని జామియా ఈద్గా సర్కిల్ వద్ద అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్ అధ్యక్షతన సోమశేఖర రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్ర మంతటా పర్యటించి జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బాలాజీ మనోహర్, న్యాయవాది శివశంకర్, బీఎస్పీ శ్రీరాములు, అమానుల్లా. జహూర్. అజ్మతుల్లా ఖాన్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, సీపీఐ వినోద్, రియల్ ఎస్టేట్ సభ్యులు అదెప్ప, ఫైరోజ్, రఫీక్ పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధన

పావగడ: గురు రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సంతాన వేణు గోపాలస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవలు, అభిషేక పూజలు, శాంతి సమారాధన చేపట్టారు. రాఘవేంద్రస్వామి చిత్రపటాన్ని పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఘనంగా ఊరేగించారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

అమరాపురం: బాల్య వివాహాలు అనర్థదాయకమని ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు పేర్కొన్నారు. శనివారం హల్కూర్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆర్డీటీ, జిల్లా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, వాటి వల్ల అనర్థాలపై ఆర్డీటీ మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ ఆధ్వక్షతన లఘుచిత్రాల ద్వారా అవగాహన శనివారం కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ.. 2006 బాల్య వివాహాల నిరోధక చట్టాల ప్రకారం వివాహన చేసుకున్న, నిర్వహించిన, సహకరించినా చట్టరీత్యా నేరమని, శిక్షార్హులు అవుతారన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు జరిగితే 1098, 100, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమిళ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత, పాఠశాల హెచ్‌ఎం ముజఫర్‌హుసేన్, మహిళా పోలీస్ నాగరత్నమ్మ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



అగళి మండలం రామపురంలో జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

అగళి: రామపురం గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామికి రామపురం గ్రామస్తులు శ్రావణ మాస శనివారం సందర్భంగా ఘనంగా జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన చెలిమిడిని జ్యోతులుగా చేసుకొని గ్రామం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆంజనేయ స్వామికి సమర్పించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

రొళ్ల: రొళ్లకొండ, మారుతి కాలనీ, వన్నారనపల్లి, హులికుంట, హెచ్‌ఎంపల్లి చెందిన మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. తర్వాత స్వామివారి విగ్రహం ఎదుట నల్లటి నువ్వులతో జ్యోతులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. రొళ్ల లక్ష్మీనరసింహ స్వామి, జీరిగేపల్లి అమ్మాజీ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

అగళి: బీరనహళ్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బేవనహాళల్లమ్మ, నాగదేవత, భూతప్పల విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అర్చకులు అమ్మవారికి గంగ పూజ, గణపతి, పుణ్యాహవచనం, కలశ స్థాపన, నవగ్రహ తదితర పూజలు చేపట్టారు. భక్తులు నియమ నిష్టలతో, భక్తి శ్రద్దలతో అమ్మవారిని ఆరాధించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు అమ్మవారికి పండ్లు, పూలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచ్ ముద్దరాజు, ఎంపీటీసీ సభ్యురాలు సన్నమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి



సీఐలు, ఎస్‌ఐలతో చర్చిస్తున్న జడ్జి ఆర్.అశోక్ కుమార్

మడకశిరరూరల్: స్థానిక కోర్టు హాల్‌లో వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అశోక్‌కుమార్ అధికారులకు సూచించారు. స్థానిక కోర్టు హల్‌లో జడ్జి శనివారం సీఐలు, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీకి అవకాశం ఉన్న కేసులు పరిష్కరమయ్యేలా చొరవ చూపాలన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



వ్రతం ఆచరిస్తున్న దంపతులు

మడకశిర: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా వేంకటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేసుకుంటూ వ్రతాన్ని కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి హాజరై పూజలు జరిపారు. వ్రతంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పరిగి: మండలంలో మోదా పంచాయతీ పరిధిలోని కోనాపురానికి చెందిన కురుబ చౌడప్ప (55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు.. కోనాపురానికి చెందిన కురుబ చౌడప్ప భార్య శాంతమ్మ ఇద్దరు పిల్లలతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా చౌడప్ప వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినప్పటికీ నొప్పి భరించలేక ఈనెల 20న సాయంత్రం పురుగు మందు తాగాడు.కుటుంబ సభ్యులు బెంగళూరులోని రామయ్య ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ హిదాయతుల్లా తెలిపారు.

క్రీడల్లో రాణించాలి

అమరాపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని థియోసాఫికల్ ఆర్డర్ ఆఫ్ సర్వీస్ జాతీయ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం వలస జెడ్పీఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.60 వేలు విలువ చేసే ఆట వస్తువులు, 30 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను సంస్థ తరపున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి, రాయలసీమ జోనల్ టీఓఎస్ కార్యదర్శి గురుకిరణ్, మండలాధ్యక్షుడు డా.బసవరాజు, ఈరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవీన్ కిలార్లహళ్లికి సేవా రత్న ప్రశస్తి



సేవారత్న ప్రశస్తి అందుకున్న నవీన్

పావగడ: కిలార్లహళ్లికి చెందిన బసప్ప, జయమ్మ దంపతుల కుమారుడు నవీన్ కిలార్లహళ్లిని ప్రతిష్టాత్మక భారత సేవా ప్రశస్తి వరించింది. విద్యా రంగంలో అతడు అందించిన సేవలను గుర్తించి చేతనా ఫౌండేషన్ వరల్డ్ ప్రైస్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ అతనికి ప్రశస్తి అందించింది. ఇటీవల నవీన్ తన సొంత ఖర్చులతో వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు పర్యటించి అక్కడి టెన్త్ విద్యార్థులకు పరీక్షల్లో భయం పోగొట్టేలా శిక్షణ ఇచ్చారు. బెంగళూరులోని కన్నడ సాహిత్య పరిషత్ కువెంపు సభాంగణంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రశస్తి అందించారు.

రోడ్డుపైనే పార్కింగ్



సోమందేపల్లి: స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌తోపాటు వాల్మీకి సర్కిల్‌లో రోడ్డు పైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సాయంత్రం 6 గంటలైతే చాలు బ్రాందీ షాపుల ముందు గంటల తరబడి ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.